హడలెత్తిస్తున్న కుక్కలు



ఉక్కునగరం రోడ్డుపై గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

- బెంబేలెత్తిపోతున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు
- నియంత్రణలో పబ్లిక్ హెల్త్ విభాగం సిబ్బంది విఫలం



ఉక్కు జనరల్ ఆస్పత్రిలో తిరుగుతున్న కుక్క

ఉక్కునగరం : ఉక్కునగరం రోడ్లపై వీధి కుక్కల స్వైర విహారం ఎక్కువైంది. ఎక్కడ చూసినా గుంపులుగుంపులుగా తిరుగుతూ స్థానికులను హడలెత్తిస్తున్నాయి. రోడ్లపై వెళ్లే బైకులపై ఎగబాకడంతో వాహన చోదకులు హడలిపోతున్నారు. ఒక్కోసారి వాటికి భయపడి వేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఉక్కు జనరల్ ఆస్పత్రి వార్డుల్లో, ఓపీతోపాటు అన్ని విభాగాల్లో కుక్కలు తిష్ట వేసి రోగులను భయాందోళనకు గురిచేస్తున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో మనుషుల ప్రాణాల కంటే కుక్కల ప్రాణాలే కొందరికి ముఖ్యంగా మారాయి. జంతు సంరక్షణ చట్టం కూడా ఆ విధంగానే చెబుతోంది. కుక్కలు మనుషులను కరిచి ప్రాణాలు తీసేస్తున్నా వాటిని ఏమి అనడానికి వీల్లేదు. అయితే వాటిని పట్టుకుని పిల్లలు పుట్టకుండా శస్త్రచికిత్స చేసే వెసులుబాటు ఉంది. చికిత్స అనంతరం వాటిని వేరే చోటకు తరలించే అవకాశం కల్పించాలి. ఉక్కునగరంలో ఇలా నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో స్టీల్‌ప్లాంట్ వాసులు కుక్కల సమూహాలను చూసి హడలిపోతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉక్కునగరంలో కుక్కలు, పందుల బెడద చాలా పెరిగింది. వాటిపై టౌన్ అడ్మిన్, పబ్లిక్ హెల్త్ విభాగానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ ఆ విభాగం సిబ్బంది సరైన చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఉక్కు నగరంలో రాత్రి వేళ రోడ్డుపై కుక్కలు

కుక్కలను నియంత్రించాలి



ఉక్కునగరంలో రోజురోజుకూ కుక్కలు పెరిగిపోతున్నాయి. స్టీల్‌ప్లాంట్ రహదారుల్లో ఎక్కడబడితే అక్కడ వాహనాలపైకి ఎగురుతున్నాయి. దీంతో బయటకు వెళ్లడానికి భయపడాల్సి వస్తోంది. రాత్రివేళ మరీ భయపడుతున్నాం. వెంటనే కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలి.

– ఎస్.రమేష్‌కుమార్, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పెదగంట్యాడ : ఏపీహెచ్‌బీ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కోసం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్ – 2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు తెలిపారు. ధర్మాల వీధి, ఎస్సీ కాలనీ, అరుణ కాంపెక్స్ ఏరియా, నీలాపు వీధి, హౌసింగ్ బోర్డు కాలనీ, నోవాస్ పోర్టు రోడ్డు ఏరియా తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఏబీఎస్ విద్యార్థిని



రోషిణి

అగనంపూడి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) 68వ రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సమీపంలోని ఏబీఎస్ పాఠశాల విద్యార్థిని సాలాపు రోషిణి ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు, ఎంపికల్లో రోషిణి సత్తా చాటింది. ఈ నెల 9 నుంచి 11 వరకు తిరుపతిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో రోషిణి పాల్గొంటుందని పాఠశాల వ్యవస్థాపకులు పి.ఎం.కొండయ్య, ప్రిన్సిపాల్ పద్మజ దీపక్, ఫిజికల్ డైరెక్టర్ ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

నెట్‌బాల్ క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్ల అందజేత



క్రీడాదుస్తులు, పరికరాలతో క్రీడాకారులు, విందుల వెంకటరమణ, తదితరులు

అగనంపూడి : కణితి హైస్కూల్‌లో ఈ నెల 9 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల క్రీడాకారులకు విశాఖ ఉక్కు ఉద్యోగి విందుల వెంకటరమణ క్రీడా దుస్తులు, స్పోర్ట్స్ కిట్లు అందించారు. పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అండర్ – 14 బాలురు, బాలికల జట్లకు వీటిని అందించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో పోటీల నిర్వహణకు తమ సహకారం ఉంటుందన్నారు. క్రీడా దుస్తులు, మెటీరియల్ అందించిన వెంకటరమణను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సూర్యప్రకాశరావు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు ఎం.మన్నాజీ, నారాయణరావు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్ పూజలు



హౌసింగ్ బోర్డు కాలనీలో ఛత్ పూజలో భక్తులు

పెదగంట్యాడ : జీవీఎంసీ 76వ వార్డు పరిధి హౌసింగ్ బోర్డు కాలనీలో యువ హిందూ సాంస్కృతిక సంఘ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఛత్ పూజ గురువారం ఘనంగా నిర్వహించారు. ఏటా కార్తీకమాసంలో వివిధ నదుల నుంచి తీసుకొచ్చిన జలాలను ఒక పెద్దగొయ్యి తవ్వి అందులో వేసి ఆ నీటిలో మహిళలు పూజలు చేయడంతోపాటు దీపాలు వదలడం ఆనవాయితీ. ఇలా చేయడం వల్ల అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని నమ్మకం. పారిశ్రామిక ప్రాంతంలో ఏటా ఈ పూజ నిర్వహిస్తుంటారు. కార్యక్రమంలో ఉమేష్‌సింగ్, జితేంద్ర వర్మ, ఉమేష్ శర్మ, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

68వ వార్డులో డ్రెయిన్ల పరిశీలన



డ్రెయిన్ పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో కిరణ్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు లతీష్

అక్కిరెడ్డిపాలెం : జీవీఎంసీ 68వ వార్డులో సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. అక్కిరెడ్డిపాలెం నుంచి తరలివెళ్తున్న మురుగు నీరు షీలానగర్ వికాస్ కళాశాల వెనుకగా గెయిల్ కంపెనీ ముందు నుంచి మింది వరకు తరలివెళ్తుంది. ఇక్కడ ఉన్న డ్రెయిన్ల పరిస్థితిని, వర్షాకాలంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఏఎంహెచ్‌వోకు గుడివాడ లతీష్ వివరించారు. భారీ వర్షాలు కురిసే సమయంలో డ్రెయిన్లు పొంగకుండా వరద నీరు ఎప్పటికప్పుడు ప్రవహించేందుకు వీలుగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా శానిటరీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలనగర్ సమస్యలు పరిష్కరించండి



తిరుమలనగర్ సమస్యలు కార్పొరేటర్‌కు వివరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి : జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్ సమస్యలు సత్వరమే పరిష్కరించాలని తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు కార్పొరేటర్ జగన్‌ను కోరారు. గురువారం ఈ ప్రాంతంలో జగన్ పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యలను అసోసియేషన్ ప్రతినిధులు ఏకరువు పెట్టారు. పాత పైపులైన్ లీకేజీల కారణంగా నీటి సరఫరా పూర్తి స్థాయిలో జరగడం లేదని, ఆటోనగర్ ఈ బ్లాక్ ఇండస్ట్రియల్ ప్రధాన కాలువ నీరు, వర్షపు నీరు కాలనీలోకి ప్రవేశించడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోనగర్ వ్యర్థాలు, చెత్త, ప్లాస్టిక్ సామగ్రి కాల్చేస్తుండడంతో వాయు కాలుష్యంతో సతమతమవుతున్నామని కాలనీవాసులు వాపోయారు. కార్యక్రమంలో నాయకులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని మురుగు కాలువలు



తోకాడలో మురుగు, పూడికతో అస్తవ్యస్తంగా ఉన్న కాలువ

అక్కిరెడ్డిపాలెం : జీవీఎంసీ 71వ వార్డులోని పలు ప్రాంతాల్లో మురుగు కాలువలు అభివృద్ధికి నోచుకోకుండా పూడిక పేరుకుపోయి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. తోకాడ శివారు ప్రాంతంలోని శ్మశానవాటిక పరిసరాల్లో మురుగు కాలువ అభివృద్ధికి నోచుకోక పూడుకుపోయింది. పలు కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు ఈ కాలువ ద్వారా తరలివెళ్తుంది. ఈ ప్రాంతంలో కార్లకు మరమ్మతులు నిర్వహించే మెకానిక్ షెడ్ల యజమానులు ఇక్కడి కాలువను చాలా వరకు కబ్జా చేసేశారు. కబ్జాదారులకు కొందరు స్థానిక రాజకీయ నాయకులు కొమ్ముకాస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణదారులను ప్రశ్నించే వారు లేకపోవడంతో వారి ఆటలు సాగుతున్నాయని అంటున్నారు. జీవీఎంసీ అధికారులు వెంటనే ఈ ప్రాంతాన్ని పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని, మురుగు కాలువ అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

17న క్రీస్తు రక్షకుని యాత్రా మహోత్సవం



వేడుకల పోస్టర్ ఆవిష్కరిస్తున్న విచారణ గురువులు

కంచరపాలెం: క్రీస్తు రక్షకుని యాత్రా మహోత్సవాలు ఈ నెల 17న జ్ఞానాపురం రక్షణగిరి పుణ్యక్షేత్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు విశాఖ అర్చ్‌డయాసిస్ వికార్ జనరల్ రెవరెండ్ ఫాదర్ డి.బాలశౌరి, రక్షణగిరి డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ క్యాథడ్రల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 8 నుంచి 16 వరకు నవదిన ప్రార్థనలు జరగనున్నాయని వెల్లడించారు. రక్షకుని యాత్రా మహోత్సవంలో విశాఖ ప్రావిన్స్ నుంచి వెరీ రెవరెండ్ ఫాదర్ భవిరి సురేష్‌బాబు ఆంగ్లంలో పవిత్ర ఆరాధన బోధన, విశాఖ అగ్రపీఠ నూతన గురువులు, ఇతరులచే తెలుగులో సమష్టి దివ్య పూజబలి జరుగుతుందన్నారు. 17న సాయంత్రం ప్రధాన పండగలో విశాఖ అగ్రపీఠ పాలనాధికారి, ఏలూరు పీఠాధిపతులు జయరావుచే సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ నుంచి రక్షణగిరి వరకు ప్రదక్షిణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సహాయ విచారణ గురువులు ఫాదర్ బి.వినయ్‌కుమార్, పి. ఆంథోనీ రాజ్, పీపీసీ అధ్యక్షుడు రాజేష్, సభ్యులు రత్నం, ఫ్రాన్సిస్, ఐతి రవికుమార్, విజయ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ డంపింగ్ యార్డులో మంటలు



ఆటోనగర్ డంపింగ్ యార్డు నుంచి భారీగా వెలువడుతున్న పొగ

అక్కిరెడ్డిపాలెం : ఆటోనగర్ డంపింగ్ యార్డులో గురువారం చెత్తకు నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. దీంతో పక్కనే ఉన్న కుంచమాంబ కాలనీ, తదితర ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఆటోనగర్‌లో సేకరించిన చెత్తను ఇలా శానిటరీ విభాగం సిబ్బంది డంపింగ్ యార్డులో డంప్ చేస్తుంటారు. దీంతో చెత్తలో ప్లాస్టిక్, ఐరన్ వంటి స్క్రాప్ ఏరుకునే వారు నిత్యం ఇక్కడకు వస్తుంటారు. వీరు పలుమార్లు బీడీలు, సిగరెట్లు కాల్చుతూ డంపింగ్ చెత్తలో వేయడంతో నిప్పు అంటుకొని మంటలు చెలరేగుతుంటాయని స్థానికులు తెలిపారు. డంపింగ్ యార్డు పక్కనున్న పలు ప్రాంతాల వారు మంటల వల్ల వ్యాపించిన పొగతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. మంటలు వ్యాపించడంపై తమకు సమాచారం అందలేదని పెదగంట్యాడ, ఆటోనగర్ అగ్నిమాపక కార్యాలయాల సిబ్బంది తెలిపారు.

శబరిగిరీశుని సన్నిధికి పాదయాత్ర



మురళీనగర్ నుంచి కాలినడకన శబరిమలకు పయనమైన అయ్యప్ప మాలధారులు

మురళీనగర్ : మురళీనగర్‌కు చెందిన అయ్యప్ప స్వామి మాలధారులు కాలినడకన శబరిమలకు పయనమయ్యారు. ఈ ప్రాంతానికి చెందిన బి.శ్రీనివాసరావు, ఎస్.హరికుమార్, టి.రమేష్, వై.వెంకటరావు స్వామి మాల ధరించి శబరిగిరీశుని దర్శనానికి కాలినడకన గురువారం పయనమయ్యారు. వీరు మురళీనగర్ రామాలయం నుంచి తమ ప్రయాణాన్ని ప్రారంభించారు. మురళీనగర్ మణికంఠ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తాడేపల్లి అప్పయ్య శాస్త్రి పర్యవేక్షణలో వీరు బయలుదేరారు. డిసెంబరు 20న అయ్యప్ప ఆలయానికి చేరుకుంటారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి నాగేందర్‌రావు, కోశాధికారి ఆనందరావు, ఉపాధ్యక్షుడు ఎం.వెంకన్న, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఐఐఏఎంలో ఇంక్యుబేషన్ సెంటర్ సేవలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్(ఐఐఏఎం) ఆధ్వర్యంలో ఇంక్యుబేషన్ సెంటర్ సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు సంస్థ సంయుక్త సంచాలకుడు ఆచార్య పి.ఎం.బాలాజీ తెలిపారు. యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, ఆసక్తి గల వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ సెంటర్ సేవలు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. ఏయూ ఆ–హబ్ సీఈవో రవి ఈశ్వరపు, శుభం సేఫ్టీ సొల్యూషన్స్ సీఈవో ప్రతీక్ సింఘీలు ఈ సెంటర్‌ను ప్రారంభించినట్లు చెప్పారు.

స్విమ్మింగ్‌లో 'స్పోర్ట్స్ ఎరీనా' సత్తా



స్విమ్మింగ్‌లో విజేతలుగా నిలిచిన ఎరీనా క్రీడాకారులు

ఎంవీపీకాలనీ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా–2024 ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్, బ్యాడ్మింటన్ పోటీల్లో ఎంవీపీకాలనీలోని ఎస్–3 స్పోర్ట్స్ ఎరీనా క్రీడాకారులు సత్తాచాటారు. నరసరావుపేట వేదికగా జరుగుతున్న ఈ పోటీల్లో స్పోర్ట్స్ ఎరీనాకు చెందిన పలువురు క్రీడకారులు పాల్గొని పతకాలు కైవసం చేసుకున్నట్లు నిర్వాహకుడు సహాని గురువారం తెలిపారు. స్విమ్మింగ్‌లో ఎస్.జశిధీస్ నాయుడు 100 మీటర్లు, 200 మీటర్ల ఫ్రీస్టైల్‌తో పాటు 200 మీటర్ల బటర్‌ఫ్లై కేటగిరీలో బంగారు పతకాలు సాధించాడు. అలాగే ఎ.హిమశ్రీ 50 మీటర్లు, 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో బంగారు పతకాలు, 400 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో రజతం సాధించింది. జి.సాయి సిద్ధార్థ్ 50 మీటర్ల ఫ్రీస్టైల్‌లో రజత పతకం కైవసం చేసుకున్నాడు. అలాగే మధ్యప్రదేశ్‌లో జరగనున్న అండర్–19 నేషనల్ స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఎస్–3 స్పోర్ట్స్ ఎరీనా క్రీడాకారుడు పార్థీవ్ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు సహాని తెలిపారు. దీంతో పాటు పలువురు క్రీడాకారులు రాజ్‌కోట్‌లో జరిగే నేషనల్ స్కూల్ గేమ్స్‌కు ఎంపికైనట్లు వెల్లడించారు.

దురలవాట్లతో క్యాన్సర్ ముప్పు



ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

పెదగంట్యాడ : అనారోగ్య కారక ఆహార అలవాట్లు వల్లే క్యాన్సర్ వస్తుందని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ 77వ వార్డు పరిధి దేవాడ గ్రామంలో గురువారం సదస్సు నిర్వహించారు. అనంతరం దేవాడ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలు అందించాలని, తద్వారా రొమ్ము క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చన్నారు. పొగాకు ఉత్పత్తి వాడకం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, గర్భసంచి క్యాన్సర్ వస్తాయన్నారు. అందువల్ల వాటికి దూరంగా ఉండాలన్నారు. వ్యాధి సోకితే కనిపించే లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది అన్నపూర్ణ, ఎం.శ్రీనివాసరావు, బి.గోపాలం, ఆర్.రమణమ్మ, బి.విజయభాను, ఎం.దేవి, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పరీక్షలపై అవగాహన ర్యాలీ



క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీలో వైద్యాధికారి ప్రదీప్ ప్రసాద్‌రాజా, తదితరులు

గాజువాక : క్యాన్సర్ పరీక్షలపై గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి వంద అడుగుల రోడ్, చినగంట్యాడ గ్రామం వరకు నిర్వహించిన ర్యాలీని ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకర్‌రావు ప్రారంభించారు. స్క్రీనింగ్‌తో సాధ్యం – క్యాన్సర్‌పై విజయం, క్యాన్సర్ నుంచి రక్ష – ముందస్తు పరీక్ష వంటి నినాదాలతో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన స్త్రీ, పురుషులకు ఈ నెల 14 నుంచి ఇంటి వద్దే క్యాన్సర్ సంబంధిత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సీహెచ్‌వో పి.నాగ అప్పారావు మాట్లాడుతూ క్యాన్సర్ పరీక్షలపై సందేహాలు వద్దని, నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు జి.రాము, బి.రత్నం, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



వెదుళ్లనరవలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

అగనంపూడి : జీవీఎంసీ 88వ వార్డులో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ విలీన గ్రామాల్లో అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, కనీస సౌకర్యాలు కల్పించడానికి ప్రణాళికాయుతంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా 88వ వార్డు నంగినారపాడులో రూ.19 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, శెట్టివానిపాలెంలో రూ.20 లక్షలతో వరద నీటి కాలువ నిర్మాణం, 39.89 లక్షలతో నరవ శివాలయం రోడ్డు, రూ.20 లక్షలతో కొత్తూరు కాలనీలో సీసీ కాలువ, కల్వర్టు, రూ.39.97 లక్షలతో కొత్తూరు బీసీ కాలనీలో సీసీరోడ్డు, కల్వర్టు, రూ.20 లక్షలతో బీసీ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, నాయకులు వెంకటరమణ, సత్తిబాబు, శ్రీకాంత్, శివ, శ్రీనివాసరావు, పైడిరాజు, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

సదస్సు జయప్రదం చేయండి



సమావేశంలో పాల్గొన్న ఏఐఎఫ్‌టీయూ (న్యూ) నాయకులు

గాజువాక : పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో సంక్షోభం, కార్మికవర్గ కర్తవ్యాలు అనే అంశంపై ఈ నెల 9న స్థానిక శ్రామికనగర్‌లో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ – న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా కోరారు. గాజువాకలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ పరిశ్రమల పరిస్థితి, ప్రభుత్వాల తీరుపై ఈ సదస్సులో వక్తలు ప్రసంగిస్తారన్నారు. పరిశ్రమలతోపాటు వ్యవసాయ రంగాన్ని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను కాపాడుకోవాలన్నారు. ఇందుకోసం వివిధ రూపాల్లో పోరాటాలు అవసరమన్నారు. అందులో భాగంగానే తాము సదస్సు నిర్వహిస్తున్నామని, కార్మికులు, ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జె.కిశోర్‌బాబు, ఆదారి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకుండా వేధించడం దారుణం



దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులు

అగనంపూడి : విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా వేధిస్తున్నారని, భవిష్యత్‌లో జరిగే పరిణామాలకు కార్మికుల సహనాన్ని పరీక్షిస్తున్న యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో ఏర్పాటు చేసిన రిలే దీక్షా శిబిరంలో గురువారం ఆయన మాట్లాడారు. 1,365 రోజులుగా దీక్షలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదని, మరోపక్క యాజమాన్యంపై ఒత్తిడి పెంచి జీతాలు కూడా చెల్లించకుండా చేస్తున్న ప్రభుత్వాలు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో అసంతృప్తితో రగిలిపోతున్నారని, యాజమాన్యం వైఖరి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే కార్మికుల ఆర్థిక ప్రయోజనాల్లో కోత విధిస్తున్న యాజమాన్యం జీతాలు కూడా చెల్లించకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సింటర్ ప్లాంట్, ట్రాఫిక్, ఈఎస్‌డబ్ల్యూఎఫ్, ఎఫ్‌ఎండీ, ఈఆర్‌ఎస్, అడ్మిన్ విభాగాల కార్మికులు పాల్గొన్న శిబిరంలో నాయకులు మసేన్‌రావు, రాజబాబు, బొండా అప్పారావు, కర్రి బాబూరావు, ఎస్.శ్రీనివాస్, కాశీ రమణ పాల్గొన్నారు.

అనధికారిక దత్తత చట్టరీత్యా నేరం



శిశుగృహలో జడ్జి శేషమ్మతో పీడీ, సిబ్బంది, తదితరులు

మర్రిపాలెం: దత్తతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అనధికారిక దత్తత చట్టపరంగా నేరమని మహిళా జడ్జి ఎం.శేషమ్మ సూచించారు. జీవీఎంసీ 53వ వార్డు ఆర్ అండ్ బీ దరి శ్రీరామ్ నగర్ వద్ద ఉన్న మహిళా, శిశు గృహలో గురువారం నిర్వహించిన శిశువుల సంరక్షణ దినోత్సవం కార్యక్రమంలో ఆమె, శిశు సంక్షేమ శాఖ పీడీ జి.జయదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ శిశువుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేశారు. 'కార' (సెంట్రల్ అడాప్షన్ రీసోర్స్ అథారిటీ) గైడ్‌లైన్స్ ప్రకారం దత్తతపై అవగాహన కల్పించారు. అనధికారిక దత్తత చట్టప్రకారం నేరమన్నారు. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ నుంచి టీకాల వరకు శిశువుకు చేరేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రాధ, వైద్యురాలు ఉమ, జిల్లా వైద్య శాఖ సిబ్బంది నాగేశ్వరరావు, శిశుగృహ మేనేజర్ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.